# చిట్టిరాజు

స్వదేశం వదలి న్యూయార్క్ వచ్చినప్పటినుంచీ సుమిత్రకు జీవితం ఏమిటోగా అనిపిస్తున్నది. 'తన'తో సంబంధం లేనట్లుగా జరిగిపోతున్నది. చదరంగంలో పావులుంటవి. ఒక్కోదానికీ కొన్ని శక్తులు, కొన్ని పరిధులు. బిషప్ మూలలకే పోతుంది. రూక్ ఎదరకీ, ప్రక్కలకీ వరుసలోనే పోగలదు. గుర్రం ఎగిరి దుముకుతుంది. పాన్ అడుగడుగు ముందుకే వేస్తుంది. రాజుకి ఒక పరిధి, రాణికి వేరే పరిధి. అందరూ తమ తమ పరిధుల్లో తమ శక్తులతో తిరుగుతూ వుంటారు. మొత్తం మీద ఒక ఆట ఏర్పడి జరుగుతూ వుంటుంది. అందులోనుంచీ తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు. తప్పించుకోగలిగితే ఆట ఏముంటుంది? ఆ పరిధులూ, ఆ శక్తులూ అవే ఆటకు మూలం. జీవితం అంతే.

సుమిత్రకు ఇటువంటి వైరాగ్యం రావడానికి ఎన్నో కారణాలు వుండొచ్చు. కూతురి యిల్లు తనదని అనుకోలేకపోవడం ఒక కారణం. మూడేళ్లు కళ్లల్లో పెట్టుకు పెంచుకొచ్చిన మనవణ్ణి వాడి తల్లిదండ్రులకు వప్పగించి తిరిగి వెళ్ళాల్సి రావడం ఒక కారణం - ఇంకా యితర కారణాలూ వుండొచ్చు వెతికితే. జీవితంలోని నాలుగు దశలూ, నాలుగు ఆశ్రమాలూ, జరిగిపోతున్న వయసూ - ఆమెకు యింతకు ముందెప్పుడూ ఆలోచనలోకి రాని జీవితసత్యాలన్నీ కళ్ల ముందే నిలబడి వుంటున్నవి యిప్పుడు. సుమిత్ర అనబడే మనిషి అంతరంగానికీ, జీవిత చదరంగానికీ సంబంధం తప్పిపోయినట్లయింది.

"మీ అమ్మ తెలివీ, నీ కొడుకు తెలివీ సమానమే. ఆవిడ ఎప్పుడూ వాడి వెనకే తిరుగుతూ వుంటుందెందుకు? వేరే పని లేనట్లు!... బుర్ర వుంటే కదా పని అవసరం!" శోభన్ వెటకారంగా గొణగటం వినిపించింది.

"నా కొడుకు బుర్రలేనివాడా?" లక్ష్మికి కోపం వచ్చినట్లుంది.

శోభన్ నవ్వు వినిపించింది. "కాదులే. వాడు చిన్నవాడు గదా. బుర్ర పెరుగుతుంది"

తనను గురించి అల్లుడు అంటున్న ఈ మాటలు విన్న సుమిత్రకు ఆశ్చర్యమూ, కోపమూ కలిగాయి.

ఆవిడ కూతురి యింటికి న్యూయార్క్ వచ్చి నెలదాటింది. కూతురూ, అల్లుడూ ఉద్యోగస్థులు కనుక పసిబిడ్డను సరిగ్గా చూసుకోలేరని మనవడు ఉదయభానుని మూడేళ్ల క్రిందట తనతో తీసుకెళ్లిపోయింది. ఇప్పుడు తిరిగి తీసుకొచ్చింది. వాడికి బాధ కలక్కుండా మెల్లగా తల్లిదండ్రుల దగ్గర అలవాటు చేసి, డేకేర్ సెంటర్‌కి వెళ్లటం నేర్పించి, వాడు స్థిరపడ్డాక తాను యింటికి తిరిగి వెళ్లడానికి మూడు నెలలు పడుతుందని అనుకున్నది. తాను లేకున్నా గడిచిపోయేటట్లు ఇంటి దగ్గర ఎన్నో ఏర్పాట్లు చేసుకుని బయల్దేరి వచ్చింది.

తెలుగువారి పద్ధతిన ఆమె అల్లుడి ఎదుటగా నిలబడి మాట్లాడటం అరుదు. కూతురు ఉద్యోగస్థురాలు గనుక ఎక్కువసేపు మాట్లాడే అవకాశమూ లేదు. ఎవరి పనులు వారివి. వాళ్ల విషయాల్లో తలదూర్చకుండా పిల్లవాడి సంగతి మాత్రం చూసుకుంటూ వుండిపోయింది. అందువలన ఆ యింట్లో జరుగుతున్న చాల విషయాలు గ్రహించలేదామె. కాని యీమధ్యన కొన్ని విషయాలు గమనించక తప్పలేదు. రుసరుసలాడే అల్లుడి ముఖం చాలసార్లు ఎదురయ్యాక, కొన్నిసార్లు గిన్నెలు విసిరికొట్టబడినాక, తలుపులు ధమధమా తన్నెయ్యబడినాక ఆమెకు మెల్లగా అర్థం అవుతూ వచ్చిన విషయం - అతని కొడుకుని ప్రేమతో మూడేళ్ళు పెంచినందుకు అల్లుడు కృతజ్ఞతతో పొంగిపోవటం లేదు! పైగా, పెంచే పని అయిపోగానే బిడ్డను తమకు వప్పగించేసి మాయమైపోకుండా ఈ మనిషి యింకా యిక్కడే ఎందుకున్నదీ అన్న చీకాకుతో వేగిపోతున్నాడు!

ఈ విషయం గుర్తించినప్పుడు సుమిత్ర చాలా ఆశ్చర్యపోయింది. తాను యీవేళ కాకపోతే రేపు వెళ్లిపోయే మనిషేగానీ ఇక్కడ వుండిపోయే ప్రసక్తి లేదు. తను వాళ్లకి సహాయంగా వున్నదిగానీ తన వలన వాళ్లకు బాధ కలక్కుండా సర్దుకునే వుంటున్నది. మరి ఈ అల్లుడికి కష్టమెందుకు? ఆమెకు చాలా బాధ కలిగింది. మూడేళ్ళ నుంచీ తానెందుకు యింత భారం నెత్తిన మోసింది?... మనసుకి ఛీ అనిపించింది.

అయినా పెట్టేబేడా సర్దుకోకుండా యింకా నిబ్బరంగా నిలబడిందీ అంటే దానిక్కారణం ఆమె "చిట్టి రాజు". మూడేళ్లు పెంచిన మమకారం నోరు నొక్కేస్తే మూగబొమ్మలా వుండిపోయింది. వాడు అమ్మమ్మా అని పిలిస్తే తాను అక్కడుండని రోజు దగ్గర్లోనే వుందని తెలుసు. కాని తన తొందరపాటు వలన వాడికి బాధ కలక్కూడదు అని నిర్ణయం చేసుకుంది. వాడికి అన్ని ఏర్పాట్లూ కుదిరాకనే తాను వెళ్లేది!

వాడికి జరగవలసిన కొత్త అలవాట్లూ, మార్పులూ అన్నీ తాను ముందుగా నిర్ణయించుకున్న పద్ధతి ప్రకారమే యీ యింటి పద్ధతికి తగినట్లుగా వాడికి నేర్పి

తగలకుండా నేర్పుతూ వస్తున్నది... ఇందులో తప్పేముంది? తన ఉనికే తప్పా? అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్య - ఈ బంధాలకి తల్లిదండ్రులకులాగా హక్కులూ, బాధ్యతలూ లేకపోవచ్చు... అంతమాత్రాన వాత్సల్యం, మమకారం లేకుండా వుంటారా?... అనుపానులు దొరక్క ఆలోచన కొనసాగలేదు. మనసు చెదిరి ఎక్కడెక్కడికో పోయింది. అక్కడ సంకల్పరహితంగా తచ్చాడే ఆలోచనా శకలాలు... అర్థం పర్థం లేకుండా మనస్సు లోతుల్లో వెచ్చదనపు స్పృహ... అంతర్వాహినిగా ఆనందం... ఎక్కణ్ణుంచీ యిదంతా? అనుకుంటూనే మగతలోకి జారిపోయింది. ఎక్కడో లోతు నుంచీ మరుపు తెరల్ని తోసేసుకుంటూ వచ్చిన స్మృతి బిందువు ఎదుటగా పరుచుకుని కథలాగా ప్రత్యక్షమైంది.

★★★

చిట్టి చేతులు - గోడ పట్టు చిక్కించుకుని పైకెగబ్రాకాలని వ్యర్థ ప్రయత్నాలు చేస్తూ. అది ఆ అయిదేళ్ల పిల్లకు దాటరాని ఎత్తుగోడ.

తాతయ్య చచ్చిపోయాడు. అందరూ వచ్చి ఏమిటేమిటో చేస్తున్నారు. "నేనూ చూస్తా, నేనూ చూస్తా, నేనూ చూస్తా" పిల్లలు యిటువంటివి చూస్తే జడుసుకుంటారని తననీ, చెల్లెల్నీ ఎదురింట్లో ఎత్తుగోడల వెనకాల వేసి తలుపు బయట గొళ్లెం పెట్టేశారు. "నేను చూడాలి. మా తాతయ్య." అంటే వినిపించుకోలేదు. అందుకే ఆ చిన్ని చేతులు గోడపైకి ప్రాకాలని ప్రయత్నం చేస్తున్నవి. పెద్దగా శోకాలూ, గోవిందలూ వినిపించేసరికి ఆత్రం పట్టలేక ఎట్లా ఎగిరిందో, గోడ పైకెక్కేసింది.

"ఎక్కింది! అదిగో, ఎక్కేసింది! దించి, లోపలెయ్యండి! జడుసుకుంటుంది!" కసిలాంటి ఉత్సాహంతో అక్కడున్నవాళ్లు ఆ పిల్లను మళ్లీ లోపలేసి గొళ్లెం పెట్టారు.

ఆ పిల్లకి తాతయ్యంటే ప్రేమా?

ఆ పిల్లకి తెలియదు.

తాతయ్యకి ఆ పిల్లంటే ప్రేమా?

ఆ పిల్లకి అదీ తెలియదు.

ఆ పిల్ల ఎప్పుడైనా తాతగారింటికి వచ్చినప్పుడు పొలంలో తాటిచెట్ల నుంచీ చాలా ముంజెలు తెచ్చేవాడు తాతయ్య. బజారు నుంచీ లేత మొక్కజొన్న కండెలు తెచ్చేవాడు. సపోటా పళ్లు తెచ్చేవాడు. బెల్లం పాకం ఓడుతూ వుండే జిలేబీ తెచ్చేవాడు. ఇవన్నీ ఆ పాపకి చాలా చాలా యిష్టమైనవి. ఇంకా ఏమేమి తెచ్చేవాడో జ్ఞాపకం లేదు. ఇవే గుర్తు. తన ఎద్దులబండిలో ఎక్కించుకుని పొలానికి తీసుకెళ్లేవాడు. ఆ యిద్దరూ ఏవేవో మాటలు చెప్పుకుంటూ వెళ్లేవాళ్లు. ఎన్నో సంగతులు అడిగేది - ఊరి నడుమనున్న

రచ్చబండ గురించీ, పొగాకు చుట్టల గురించీ, పోతరాజు గుడి గురించీ, అక్కడున్న ఊడలమర్రి గురించీ, అందులో వుండే దయ్యాల గురించీ, ఊరి మధ్యనున్న మంచినీళ్ల బావిగురించీ చాలా విషయాలు - తోచినవన్నీ అడిగేది. అడిగినవన్నీ చెప్పేవాడు. గతుకుల బాటలో బండి కుదిపేస్తుంటే ఎగిరిపడి నవ్వుకుంటూ ఎన్నో సంగతులు తాపీగా చెప్పుకుంటూ పోయేవాళ్లు. విశాలమైన ఆకాశం క్రింద నిరంతరాయంగా వీచే చల్లనిగాలి మీదుగా ప్రవహిస్తూ వుండేది.

ఎన్నో జ్ఞాపకాలు, గాఢమైన అనుభూతులు. వాటితో అవినాభావంగా స్వేచ్ఛా సంతోషాలు. బ్రతికి వుండటమే ఆనందం. అది అద్భుత ప్రపంచం!

తాతయ్యకు జబ్బు చేసినప్పుడు "తాతయ్యా! నీ దగ్గరేదో వాసనొస్తున్నది. లేచి నీళ్లు పోసుకో" అన్నది. "నాకు జ్వరం కదా, నేను మంచంలో నుంచీ లేవలేను" అన్నాడు. ఆరిందాలా తలూపుతూ "కావాలనుకుంటే లేవొచ్చు. ఏముందీ, ఇలా పైకి లేవడమే!" అని లేచి చూపిస్తే నవ్వాడు. అందరూ కోప్పడ్డారు. వాసన అనకూడదంట, నిజంగా వాసన వుంటే కూడా. తాతయ్యకి జబ్బు ఎక్కువైపోయింది. పిచ్చి మాటలు మాట్లాడేవాడు. బయట వడ్లపురి మీద నుంచీ వ్రేళ్లాడుతున్న గడ్డిపరకల్ని చూస్తూ "అమ్మా, ఎన్ని లోలక్కులో! పెట్టుకో, బాగున్నయ్యి" అన్నాడు. ఆ పిల్లకు లోలక్కులంటే యిష్టం అని తాతయ్యకు తెలుసు. అయినా అవి గడ్డిపరకలు గదా! ఆ పిల్ల చాల నవ్వింది. కానీ తాతయ్య నవ్వలేదు. తరువాత చచ్చిపోయాడు.

'మీ తాతయ్యకు నీవంటే ప్రేమ' అన్నారు. కానీ ఆ విషయం గురించి ఆ పిల్ల ఆలోచించలేదు. అవసరం కలగలేదు. ఆ చిట్టి చేతులు ఆ ఎత్తుగోడల పైకి ప్రాకాలని గుడ్డి ప్రయత్నం చేశాయి వ్యర్థంగా. తనను ఆ చోటికి, తాతయ్య దగ్గరకు వెళ్లనివ్వలేదు వాళ్లు. తరువాత తాతయ్య లేడు. ఒంటరిగా కూర్చున్నపుడు 'తాతయ్యా, నువ్వు ఎక్కడున్నావు? ఎందుకెళ్లిపోయావు?' అనుకున్నది చాలాసార్లు దిగులుగా.

★★★

నలభై ఏళ్ల తర్వాత అప్పటి అనుభవంలోని గాఢతా, బరువూ తొలగిపోయినై. ఇప్పుడు సుమిత్రకు తాతయ్య ఒక తియ్యని జ్ఞాపకం. ఆనాటి గాలీ, ఆకాశం, స్వేచ్ఛలతో ముడివడిన సత్యం. లోకరీతిన విలువలేని సామాన్య విషయం.

'పిల్లలు తమకెదురయ్యే అనుభవాల్ని గ్రహించే పద్ధతి వేరు. దానికి భాష లేదు. వ్యక్తీకరణ అక్కర్లేని స్పందన అది. భూత, భవిష్యత్తులతోనూ మనో వ్యాపారంతోనూ సంబంధం లేని వర్తమానం. పెద్దల తీరు వేరు. భాష ఆధారంగా తమ స్పందనల్ని

అర్థం చేసుకుంటూ అనుభవిస్తారు. వాళ్లకి పసితనపు అద్భుతాన్ని గ్రహించే మార్గమేది?' అనుకుని నిట్టూర్చింది సుమిత్ర.

"అమ్మమ్మా!"

"అమ్మమ్మా!"

తానేదో ప్రముఖ వ్యక్తి అయినట్లు గొప్పదనం ఒలకబోసుకుంటూ దర్జాగా అడుగులేస్తూ వస్తున్నాడు మనుమడు. ఆ పిలుపులో అధికారం నిండి వుంది. చిన్న బుడుతకు ఎంత ధీమా! ఆవిడ తన ప్రత్యేక అంగరక్షకురాలైనట్లు!

"అమ్మమ్మా!" గట్టి కేక.

ఒక్కక్షణం ఆలస్యంగానీ నిర్లక్ష్యంగానీ సహించలేడు! వాడి సొంత అమ్మమ్మ వాడి మాట లక్ష్యపెట్టకపోవడమా? నవ్వుకుంటూ 'చిట్టి రాజు' అనుకుంటూ లేచింది. ఆవిడ జీవితంలో మూడేళ్లపాటు ప్రతి నిమిషమూ తనదిగా చేసుకున్న మహారాజు!

"భోజనానికి టైమయింది, రా!" అంటూ లక్ష్మి వచ్చి వాడినెత్తుకెళ్లింది.

అక్కడనుంచీ సుమిత్ర వున్న గదిలోకి అన్నీ వినిపిస్తున్నవి.

"అమ్మమ్మ కావాలి"

"ఎందుకూ? బయట తిరుగుతూ అన్నం తినకూడదు. టేబుల్ దగ్గరే తినాలి! తిను!"

"అమ్మమ్మ వస్తే తింటా!"

వాళ్ల నాన్న 'నోర్ముయ్' అనడమూ, ఫట్‌మన్న శబ్దమూ, వాడు 'అమ్మమ్మా' అంటూ ఏడవటమూ వినిపించాయి.

ఆ దెబ్బ తనకే తగిలినట్లు విలవిల్లాడింది సుమిత్ర. 'వాళ్ల నాన్న వాడికి అన్నం తినడం నేర్పిస్తున్నాడు' అనుకుంది, తన మనసుని అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నిస్తూ.

వాడి ఎక్కిళ్లు క్రమంగా తగ్గిపోయినై. వాళ్లమ్మ ఎత్తుకుని ఓదారుస్తున్నట్లుంది. మనసును కుదుటపరచుకునే ప్రయత్నంగా సుమిత్ర ఆలోచనలు వేదాంతపు దారిపట్టినై. లోకం దృష్టిలో మనిషంటే ఏమిటి? ఒక పరిధి లోపల ప్రవర్తించవలసిన ఒక రూపం. ఆకాశమంతా నిండి వుండే అతని అంతస్సత్వం కాదు. అతని కోరికలూ, ఆశలూ, అనుబంధాలూ కాదు. లోకంలో అతను చెయ్యవలసిన పనులూ, చేస్తున్న వ్యాపారాలూ అతని నిర్వచనం. ఎంత విచిత్రం! నిజానికి ఎంత దూరం!

భోజనాల గదిలోనుంచీ అన్నం పళ్లెం బల్లుమని నెట్టిన శబ్దం. అది టేబుల్ పైనుంచీ క్రింద పడ్డ చప్పుడు. ఆ పళ్లెమేదో తన గుండెల మీద వచ్చిపడ్డట్లు ఎగిరిపడింది

ఆమె. ప్రయత్నం మీద స్థిమితపడ్డా, గుండె వేగం తగ్గలేదు. ఆలోచనలు అర్థంకాని ఆదుర్దాతో వేగం పుంజుకుని ఎటో పరుగెత్తుతున్నవి... వాడిని అన్నం తినమంటే అమ్మమ్మ కావాలంటాడు. నిద్రపోమంటే అమ్మమ్మ దగ్గరకు పోతానంటాడు. వాడిని మంచి చేసుకునే ప్రయత్నంగా బజారుకు తీసుకెళ్ళి కోరిన బొమ్మలు తెస్తే, ఇంట్లో కాలు పెట్టగానే ఆ బొమ్మలన్నింటినీ పట్టుకుని, 'అమ్మమ్మా, ఎన్ని బొమ్మలో చూడు!' అంటూ నేరుగా ఆమె దగ్గరికి వచ్చేస్తాడు. కొడుకుని సొంతం చేసుకోవాలని ఆరాటపడుతున్న తండ్రికి కోపం రాదా? అన్నం పళ్లెం తోసెయ్యడా? అతన్ననుకోవలసిన పనిలేదు! అంతేకాకుండా లోకరీతిన తను పరాయి మనిషని మనవడు తెలుసుకోవాలి కదా.

ఊరికే పెంచిన మమకారాన తనిట్లా బాధపడుతున్నది. అవసరం లేదు.

భజగోవిందం భజ గోవిందం
గోవిందం భజ మూఢమతే!
సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చలతత్వే జీవన్ముక్తః

కర్తవ్యం తెలిసింది. కనుక యిహ తను సాధించాల్సింది సత్సంగత్వం, నిస్సంగత్వం, నిర్మోహత్వం, నిశ్చలతత్వం - అంతే! తరువాత మిగిలేది ముక్తి. అప్పుడు అసలు బాధే వుండదు.

"మీ అమ్మ వీడిని గారాబం చేసి పాడుచేసింది. డిసిప్లిన్ లేదు, పాడూ లేదు. ఇహ వీడికి బాధ్యతలు ఎట్లా తెలుస్తవి? వీడు ఏమైపోతాడో, ఏమో!" పెద్దగా అరుస్తున్నాడు శోభన్, కొడుక్కి నిజం బోధపరచలేక.

ఆవిడ వేదాంతం పారిపోయింది. ఎందరో అల్లుళ్లు ఎందరో అత్తల్ని అన్నమాటలే! అని తెలిసినా, విన్నప్పుడు ఒంటికి కారం రాచుకున్నట్లే అయింది. 'పిల్లల్ని సంపూర్ణ వ్యక్తులుగా దిద్దటానికి ఇదే సరైన మార్గం అంటూ ఒక పద్ధతి నిర్ణయంగా ఏర్పడి వున్నదా? అనుకుంది చికాగ్గా. డిసిప్లిన్, బాధ్యత అన్నపదాలు వింటే ఆమెకి ఎప్పుడూ కంపరమే. పిల్లల పెంపకాన్ని గురించి ఒక ఆంథ్రోపాలజీ పుస్తకంలో చదివిన విషయాలు మననం చేసుకుంది కోపంలోనే

సర్వంగా నడుస్తున్న సాంఘిక వ్యవస్థలో పిల్లల పెంపకానికీ, వాళ్ళు పెద్దయ్యాక ఏర్పడే వ్యక్తిత్వానికీ మధ్యన వుండే సంబంధం ఇంకా పూర్తిగా, కచ్చితంగా నిర్ధారణ

కాలేదు, కానీ కొన్ని విషయాలు స్థూలంగా గుర్తించబడినవి:

బాల్యంలో అతి నిర్లక్ష్యానికి గురైన పిల్లలు పెద్దయ్యాక మానసిక వ్యాధులకు లోనవుతారు. గారాబం చెయ్యబడిన పిల్లలు అలాకారు. పైగా, మానసికంగా స్థైర్యం కలిగిన శక్తిమంతులౌతారు. తల్లి ఒక్కదాని దగ్గరే కాక నలుగురి ఆదరణలో పెరగటం పిల్లలకు మంచి చేసే అవకాశం వుండి, జీవనక్రమంలో అనుభవించిన ప్రేమ, ద్వేషాలు వ్యక్తిత్వ వికాసంలో మిగతా అన్ని విషయాల కంటే ముఖ్యపాత్ర వహిస్తాయి...'

తాను మనవణ్ణి పెంచటంలో పొరపాటేమీ చెయ్యలేదు!

అసలు తనకెందుకింత బాధ? బిడ్డ బాధ్యత తల్లిదండ్రులదేగాని తనదికాదు, నిజమే! తన ఆలోచనలే సవ్యంగా లేవు! ప్రతి మనిషికీ లోకరీతిలో ఒక పాత్ర కేటాయింపబడి ఉంది. ఆ పరిధిలో సంచరించి తప్పుకోవాలి నాటకంలో పాత్రలాగా... కానీ మనిషి అంతరంగంలో ఒక భాగానికి ఆలోచనకు అందకుండా, ఏ సూత్రానికీ కట్టుబడకుండా ప్రవహించే గుణం వున్నట్లుంది. మనిషి మొత్తాన్ని తనలోకి లాగేసుకోగలదు అది!

ఆమెకు సరిగ్గా అదే జరిగి వుంటుంది. ఆమె చేతులు ఏడుస్తున్న మనవణ్ణి ఎత్తుకుని కన్నీళ్లు తుడవాలని ఆరాటపడుతున్నవి. చూపు పేదదై పరిసరాల్ని గమనించడం మానేసింది. 'అమ్మమ్మా' అన్న మనవడి పిలుపొక్కటే చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నది. ఆమె తన పరిధిలో వుండకుండా మనమడిలోనికి ఎట్లా ప్రవహించి పోయింది? బుద్ధికి అందకుండా వుంటూ చిత్తానికి రంగులు పులిమే యీ మమకారాలను ఎట్లా అదుపు చెయ్యడం?

ఇంతవరకూ బిగబట్టుకున్న కన్నీళ్లు యిప్పుడు కురవటం మొదలెట్టాయి... తనకోసం మనుమ సంతానాన్ని ప్రేమించి స్పందించిన స్త్రీలందరి కోసం, వారి వాత్సల్యాన్ని పోగొట్టుకున్న అమాయకపు మనవళ్ల నిస్సహాయత కోసం - మనసారా ఏడ్చుకున్నది. ఆ కన్నీళ్లలో ఆమె కోపం కడుక్కుపోయింది. 'ప్రపంచంలో ఎన్నో అనుభవాలు ఎదురౌతవి. అవి తనలోని నిజాన్ని తెలుసుకోవడానికి సాధనాలు మాత్రమే కావాలి' అనుకుంది వేదాంత ధోరణిలో. 'నేను అజ్ఞానంలో పెంచుకున్న మమకార బంధం యిదంతా' అనుకున్నది విరక్తితో.

"అమ్మమ్మా!" అంటూ వచ్చాడు ఉదయభాను.

'నేను ఎప్పుడూ అమ్మమ్మ దగ్గరే నిద్రపోతా!' ఈ వూరు వచ్చిన తొలిరోజుల్లోనే స్పష్టం చేశాడు తన అభిప్రాయం. రోజూ వీడితో గొడవ పెట్టుకొని సమయం వ్యర్థం చేసుకోవడం యిష్టం లేక, విశ్రాంతిగా టీ.వీ. చూసుకునే అలవాటు మానుకోలేక 'సరే'

అని ఒప్పుకున్నారు అమ్మా నాన్న. తన బుల్లి బుల్లి ప్రయత్నాలతో ఏదో సాధించాననుకున్న చిట్టిరాజు రాత్రి నిద్రపోవడానికి అమ్మమ్మ దగ్గరకే వస్తున్నాడు యిప్పటివరకూ.

మనవణ్ణి ముద్దుపెట్టుకుని ప్రక్కన పడుకోబెట్టుకుంది సుమిత్ర. ఆమె మనసు నిండా ముసురుకొని వున్న ఆలోచనలన్నీ మటుమాయమై పోయినై. మనవణ్ణి చూడగానే నీరసపు వేదాంతం పోయి సంతోషం ముంచుకొచ్చింది. దానితో పాటు సర్వజనావళి పట్ల గొప్ప ఔదార్యమూ వచ్చేసింది. 'పుర్రెకో బుద్ధి అన్నమాట వుండనే వుంది. ఎవరి ఆలోచనలు వారికుంటాయిగదా' అనుకుంది అల్లుణ్ణి గురించి ఉదారంగా.

మనవడి తల నిమురుతూ "నాయనా, నీవు చాల పెద్దవాడివి అవుతావు. మంచివాడివి అవుతావు. అప్పుడు నేను దూరంగా మనూళ్లో ఎక్కడో వుంటాను. నీవు పెద్దవుతావుగదా, అందుకని. మా బాబు ఎంత పెద్దయ్యాడో అని బలే సంతోషిస్తాను" అన్నది సుమిత్ర.

ఆమె చెబుతుండగానే "ఊ సరే, అవుతాలే" వరమిస్తున్న దేవుడిలాగా సెలవిచ్చి అమ్మమ్మ మీద చెయ్యేసి నిద్రలోకి జారిపోయాడు వర్తమానపు ఉదయభానుడు.

'జీవితం చాల విచిత్రమైనది' అనుకుంది సుమిత్ర అలసటగా. మనసు యొక్క యీ నిరంతర చలనంలో 'నిజం' ఎక్కడుందో ఆనవాలు చిక్కలేదామెకు.

★★★